


# టైమెంతవుంది?

కె.వి.యల్. నరసింహశాస్త్రి

నన్ను వెర్రివాడనుకోనివ్వండి, పిచ్చివాడనుకోనివ్వండి, చాదస్తంగా నవ్వుకోనియ్యండి, ఎవరైనా 'నీ జీవితాశయం ఏమిటి'ని అడిగితే (అడక్కపోయినా) 'వాచీ కొనుక్కొని, చేతికి అలంకరించుకోవడం' అని ఠక్కున చెప్పేవాణ్ని!

చిన్నప్పటి నుంచి నాకు వాచీ అంటే వింతోష్టం. ఏ నాటికైనా వాచీ కొనుక్కోవాలనే పట్టుదల అంతరాంతరాల్లో ఉంది. కార్యరూపం దాల్చడానికి తైలం ... అదే డబ్బు కావద్దూ.

నాబోటి వాడికి వాచీ ఉండటం నిజంగా పెద్ద లగ్జరీ. అవునండీ... హైస్కూలు దాటి చదువుకోడానికి మా ఆదాయం అనుమతించలేదు రెండేళ్ళు చిల్లర పనులు చేశాక ఓ ఫ్యాక్టరీ తాలూకు ఆఫీసులో గుమాస్తా నయ్యాను, మూట యాభై రూపాయల జీతంతో.

ఐదు రూపాయిలు నాకోసం ఉంచుకున్నా ... అవీ నెలాఖర్లో బయటకు వచ్చేస్తుంటాయి.

కృష్ణానది నీలినీళ్ళంటే నాకు ప్రాణం. ఆ నీళ్ళ ఒరవడిలో కనిపించే ప్రకృతి నాట్యానికి పరవశించి పోతుంటాను. నా మనోవాంఛను అర్థం చేసుకుని, ఆశీర్వదించే కృష్ణవేణమ్మ అమృత హృదయం నాకు ఊపిరి కృష్ణాతీరాన నివసిస్తూ, కృష్ణ నీటిని ఒంటబట్టించుకునే అదృష్టం కలిగినందుకు పొంగిపోతుంటాను. జాను తెలుగును ఓకారపు సొంపుని తనలో నింపుకున్న స్వర్గీయ మల్లాది రామకృష్ణ శాస్త్రిగారి 'కృష్ణాతీరం' నవల ఎంతో ప్రయత్నం మీద కొనుక్కొని పదిల పరచుకున్నాను కృష్ణాతీరానికి వెళ్ళి, ఆ పరవళ్ళని అలా చూస్తూ మైమరచి పోతుంటాను. అలా జరక్కపోతే ఏదో వెలితి...

వాచీ కొనుక్కోవటం కోసం, 'వాచీనిధి' పేరిట ఒక ఫండ్‌ని ఏర్పాటు చేసుకున్నాను. నాబోటి నిరుద్యోగుల జీ(వి)తాల్లో మిగులుండటమనేది మిథ్య! అయినా ఎలాగోలా రెండో, మూడో వేస్తుండే వాణ్ణి! ఏభయ్యో అరవయ్యో కాగానే కంఠంమీద కత్తిలాగ ఏదో అవసరం వచ్చిపడేది. నిధి నుంచి తీయక మరో దారుండేది కాదు. మళ్ళీ నీలు చూసుకుని నిధిని నింపుతూండేవాణ్ని!

ఆఫీసులో అందరికీ వాచీ లున్నా నాకే లేదు దారిలో ఎవరన్నా టైమడిగితే, స్టైయిల్‌గా వాచీవంక చూస్తూ టైమూ... టైమూ... అని ఎప్పుడు చెబుతానా అని కలలు కంటున్నాను మన దోపిడి సమాజంలో టైము చెప్పేవాళ్ళకన్నా, అడిగేవాళ్ళే ఎక్కువ కదా!

రోజులు గడుస్తున్నాయి. వాచీ నిధి పెరుగుతూ, తరుగుతూ వస్తోంది. మా ఆఫీసులో కొత్తగా టైపిస్టుని వేసుకున్నారు. ఆ అమ్మాయి ఆఫీసులోకి అడుగు పెట్టగానే, ఆ అమ్మాయి చేతివంక చూశాను గాజులే ఉన్నాయి. అమ్మయ్య, వాచీలేదు!! నాకు తోడు దొరికిందనుకున్నాను. కానీ ఉద్యోగంలో చేరిన ఐదో రోజున ఆ సుజాత... అదే టైపిస్టు...వాచీ పెట్టుకుని వచ్చింది. ఆరోజు నుండి రోజూ పెట్టుకుని వస్తోంది. దబ్బపండులాంటి చేతిమీద మెరుస్తూ ఆ వాచీ! నేను మళ్ళీ ఒంటరివాడి నయిపోయాను.

సుజాత సీటు నా పక్కనే. ఆమె ఎడమ చెయ్యి నాకు అతి సమీపంలో ఉండేది. అందువల్ల ఆమెకు, నాకు నష్టమేమీలేదు. అయితే ఆ చేతికి వాచీ ఉండేది. అదీ బాధ.

సుజాత టైపు చేస్తుంటే ఆ చేతివంక చూస్తుండే వాడిని, పని కూడా మానుకుని. సుతారంగా వేళ్ళు టైపు అక్షరాలను నొక్కుతుంటే, వాచీ కింద నరాలు లయగా కదులుతుండేవి. ఆ సుందర దృశ్యాన్ని చూస్తుంటే... సుహదా నందంగా ఉండేది ... లోపల బాధగానూ ఉండేది.

ఓ రోజున సుజాత నడిగాను; "ఏమండీ, ఈ వాచీ మీ స్వంతమేనా, లేక..."

"నాది కాదండి. మా అక్కది. మా బావ దానికి కొత్త వాచీ కొని పెట్టాడు. ఇది నాకిచ్చేసింది. ఏం, అలా అడిగారు?"

"అబ్బే, ఏంలేదండీ, ఊరికినే..."

"నాకు తెలిసింది లెండి... మీ జీవితాశయం వాచీ కొనుక్కోవటమటగా...విష్‌యు బెస్టాఫ్ లక్..." అంది సుజాత నవ్వుతూ.

అవాక్కైపోయాను. సుజాతకూ తెలిసిపోయిందీ? అవును. తెలియదూ! ప్రతివాడి దగ్గరా, 'వాచీ ఏనాటికైనా కొనుక్కోవాలండి, కొనుక్కుంటానండీ' అంటూ వాగనాయె!

కాలం తనలో రెండేళ్ళని ఇముడ్చుకుంది. నేను కృష్ణాతీరాన విహరిస్తూ, ఆ నీలి నీళ్ళలోకి చూస్తూ, వాచీ గురించి కలలు కంటూ గడుపుతున్నాను. నా మనసు ఆరాటాన్ని అర్థం చేసుకున్నట్లు అలలు నవ్వుతుండేవి.

మా వాళ్ళ పోరుతో పెళ్ళి చేసుకున్నాను. రాజ్యం కాపురానికొచ్చింది. మాకు మల్లే వాళ్ళదీ సామాన్య కుటుంబం కావటంవల్ల చాలా పొదుపుగా ఉండేది. నా ఆశయం శోభనం నాడే చెప్పేశానేమో, వాచీ నిధిని ఓ కంట కనిపెడుతుండేది రాజ్యం.

రాజ్యం నా జీవితంలో ప్రవేశించిన వేళా విశేషం ఏమోగాని, నా సీటు మారింది. నేను పుచ్చుకునే జీతం యాభై రూపాయలు

# టైమెంత అయింది?

పెరిగింది. ఆర్నెల్లు తిరక్కుండానే మరో పాతిక పెరిగింది. అంతా రాజ్యం అదృష్టం. వాచీనిధి పుష్టిగా ఉంది.

నాకు ధైర్యం వచ్చింది. నా ఆశ, అడియాస కాదు. కలలు కల్లలై పోవు. చేతికి వాచీ పెట్టుకుంటాను. టైమెంతండీ. టైమా... టైమూ...

*　　*　　*

ఓ రోజు పొద్దున్నే రాజ్యం భళ్ళు భళ్ళుమని కక్కుకుంది. కంగారుపడి వాచీ నిధీ కక్కుకుంది. 'కంగ్రాట్యులేషన్స్' అంటూ డాక్టరు తండ్రి కాబోతున్నారని చెప్పింది. మా యింటోకి మరో మెంబరు!

ఈ గొడవల్లో వాచీనిధి అశ్రద్ధకు గురయ్యింది. మందులూ, అవీ కొనడంతో అవకాశమే ఉండేది కాదు.

రాజ్యం మగపిల్లాణ్ణి ప్రసవించింది. ఈ సందర్భంలో కూడా ఆ తల్లీ బిడ్డల అదృష్టంగా, నా జీతం మరి పాతికరూపాయలు పెరిగింది.

పిల్లాడికి రమణ అని పేరు పెట్టాము. నా వాచీ నిధికి ప్రాణం వచ్చి ఊపిరిపోసుకోసాగింది. రాజ్యం, నేనూ పంతొందలగా వాచీ నిధిని పెంచుతున్నాం. వాచీ నిధి నూట యాభై రూపాయలు దాటింది.

ఓ రోజున సూపర్ బజారు కెళ్ళి వాచీలన్నీచూసి వచ్చాను. నీలంరంగు డయల్ ఉన్న వాచీ నా కెంతగానో నచ్చింది. దాని ధర రెండు వందల వందల యాభై రూపాయలు.

నాతోపాటు కృష్ణాతీర విహారానికి రాజ్యం కూడ వచ్చేది. అంతకు ముందు ఒకరి కొకరు తెలియని జీవిత భాగస్వాముల ఇష్టా యిష్టాలు ఒక్కటే కావటం విచిత్రం కాదూ? విచిత్ర మేమిటి, వరం!

*　　*　　*

కృష్ణవేణీనదీ తరంగాలపై పున్నమి చంద్రుడు ప్రకాశించి ప్రకాశిస్తున్నాడు. కొంచెం దూరంలో ఇసుకపై నేను, రాజ్యం, రమణ ఉన్నాము. మేమూ ఆనంద పరవశంలో తేలిపోతున్నాం సరిగ్గా ఆ పున్నమికి వాచీ నిధి రెండువందల యాభై రూపాయిలయింది.

చిన్నప్పటినుంచి ఎన్నికలలు కన్నాను? వాచీ పెట్టుకోవాలని నా ఎడమ చేయి ఉవ్విళ్ళూరగా, ఆ చేతిని ముద్దుగా రాజ్యం పెంచుకుంది. నిండుతనం తెచ్చింది. మా జీవితంలోకి రమణ వచ్చాడు. వాడువచ్చి మూడేళ్ళయింది కూడాను.

ఈనాటికి నాకలలు పంటకొచ్చాయి.

మర్నాడు—

ఆఫీసుకి సెలవు పెట్టాను. దాదాపు పుట్టినరోజంత హడావిడీ చేసింది నా ఆవిడ. నా కిష్టమైన పులిహోర చేసింది. పులిహోర చెయ్యటంలో రాజ్యం ఎక్స్‌పర్ట్!

మధ్యాహ్నం మూడయింది.

'రమణేడి' అనడిగాను, రాజ్యాన్ని.

'పక్కింటి కెళ్ళాడు' చెప్పింది రాజ్యం.

## "నాడు-నేడు"

నాడు—

అందాల రెమ్మ - అపరంజి బొమ్మ
కలల అలలపై తేలిరాగా -
కళ్ళతో స్వాగతం పలికాను
మనోమందిరంలో ప్రతిష్ఠించాను
అనురాగ-ప్రేమ పరాగోపరణాలతో
అర్చన చేశాను
హృదయనీరాంజనాలతో జీవితాన్నే
హారతి పట్టాను.

నేడు -

నా కలలన్నీ కల్లలు చేసి
కళ్ళ కన్నీరు నింపి
మనసును వక్కలు చేసి
హృదయజ్యోతిని ఆరిపి చీకటి గావించి
దేవుడు లేని గుడిలా
మనసు లేని హృదయాన్ని మిగిల్చి-రగిల్చి
జీవితాన్ని స్మశానవాటిక చేసి
వెళ్ళి పోయిందా శిలా ప్రతిమ.

—మడవనూరి సుబ్రమణ్యం.

ఈలోగా వాడు రానే వచ్చాడు. వాడి చేతికి వాచీ ఉంది. పక్కాయన వాచీ కదూ అది?

మా పక్క వాటాలో ఉన్న దంపతులకి పిల్లల్లేరు. మా రమణ వాళ్ళకి అభిమాన పుత్రుడు.

ఆయన కొత్తగా వాచీ కొన్నాడు చాలా బావుంది. ఆ వాచీ పెట్టుకుని రమణ అటూ ఇటూ తిరిగేస్తున్నాడు. వాడి అదృష్టమూ అది?

"నాన్నా, దీన్లో ఏముంటుంది? ఎప్పుడూ టిక్కు టిక్కు మంటూ ఉంటుంది" అనడిగాడు రమణ, నాకు చూపిస్తూ.

"దాంట్లో చిన్న పక్షి ఉంటుందిరా. భలే ఉంటుందిలే. అదే టక్కు టక్కు మంటుంది" అని చెప్పాను సరదాగా. వాచీ పట్ల నాకున్న ఆకర్షణ అలా చెప్పించిందేమో!

బజారెడదామని తయారయ్యాం.

'రమణా' అని పిలుస్తూ వరండాలోకి వచ్చాను. వెనకాల రాజ్యం వచ్చింది.

రమణ అటు తిరిగి ఉన్నాడు. దేన్నో రాయి పెట్టి కొడుతున్నాడు

దగ్గర కెళ్ళి చూద్దును కదా, వాచీ పప్పుపప్పుగా ఉంది!!

"నాన్నా, దీన్లో పక్షిలేదు" అన్నాడు రమణ అమాయకంగా చూస్తూ.

"వెధవా..." అంటూ వాణ్ణి రెండు వడ్డించింది రాజ్యం. వాడు రాగాలాపన ప్రారంభించాడు.

రమణ ఏడుపు విన్నారు కాబోలు, పక్క వాటా దంపతులు వచ్చారు

తలొంచుకుంది రాజ్యం, తప్పంతా తన దయినట్టు. ఎవరిది తప్పు?

ఖరీదైన వస్తువు చిన్న పిల్లాడికిచ్చిన వాళ్ళదా?

పక్షి ఉందని పసివాడిలో ఉత్సుకత రేపిన నాదా?

ఆ చిన్న పక్షిని చూడాలని బద్దలు కొట్టిన రమణదా?

ఎవర్ని ఏమనాలి?

మౌనంగా ఊరుకుండిపోయాము.

తర్వాత—

రెండు వందల యాభైకి మరో ఇరవై చేర్చి, మా పక్కవారికున్న వాచీ లాంటిది కొని వారికిచ్చేశాను.

రమణ చేతిలో పప్పు అయిన వాచీ పరికరాల్ని రిపేరింగ్ షాపులో అమ్మగా పాతిక రూపాయిలు వచ్చాయి. వాటిని వాచీ నిధిలో వడేశాను.

మళ్ళీ నెల నెలా వాచీ నిధిని పోషిస్తూ ...కలలు కంటూ...కృష్ణా తీర విహారం... ఆశల శిఖరాలపై అందని అందమైన వాచీ ... టైమెంతయిందండీ... టైమా ... టైమూ...? అంటూ అడగటం ... ●